

దౌల్తాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

# పనులు వేగంగా పూర్తి కావాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

కొడంగల్, జూన్ 25 : అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గం, దౌల్తాబాద్ మండలంలోని దౌల్తాబాద్, దేవర్‌ఫసల్‌వాద్, గోకఫసల్‌వాద్ గ్రామాల్లోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులు నాణ్యతగా ఉండాలన్నారు. మౌలిక వసతుల కల్పన పనులు ఇప్పటివరకు ఎన్ని పాఠశాలల్లో పూర్తయ్యాయి.. ఇంకా ఎన్ని బడుల్లో కొనసాగుతున్నాయని ఆరా తీశారు. తరగతి గదుల్లోని ఫ్యాన్లు, లైట్లు, కిచెన్ షెడ్లు, తాగునీరు వంటి వాటిని పరిశీలించారు. మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్లను పరిశీలించి బోర్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, అధికారులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

**రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్**

రంగారెడ్డి, జూన్ 25 (నమస్తే తెలంగాణ) /వికారాబాద్ : చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, పిల్లలకు యూనిఫామ్‌లు, తాగునీటి సరఫరా, టాయిలెట్ల నిర్మాణం, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర మహిళా, శిశు, సంక్షేమ శాఖల ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించామన్నారు. గత ఐదారేండ్లుగా పిల్లల సంక్షేమానికి ఏమీ చేయని ప్రముఖ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి కార్యాచరణ, పిల్లలు నేర్చుకోవాల్సిన పాఠ్యాంశాలు, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ప్రణాళికను రూపొందించామన్నారు. అలాగే సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్‌లెట్‌ను రూపొందించామని చెప్పారు. అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలోని 16,00 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి రోజూ తెరవాలని, అందులో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత లేకుండా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి సూపర్‌వైజర్ ఇంటింటికెళ్లి బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి బలవర్ధకమైన పౌష్టికాహారం అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. బలహీనంగా,





వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్..అధికారులు

ఎదుగుదల, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారంతోపాటు, బాలామృతాన్ని కచ్చితంగా అందించాలన్నారు. అదేవిధంగా వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ..జిల్లాలోని 1,107 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు బాలామృతాన్ని అందించాలన్నారు. సదరం క్యాంపుల ద్వారా అర్హులైన దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వయోవృద్ధుల ఖర్చుల నిర్వహణకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని.. ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సంక్షేమ శాఖ అధికారిణులు పద్మజారమణ, వెంకటేశ్వరమ్మ, ఎఫ్ఆర్వో వెంకటేశ్, సఖీ కేంద్రం అధికారిణి యశోద, బాలల పరిరక్షణ అధికారి ఆంజనేయులు, శిశు గృహ మేనేజర్ శోభారాణి, సీడీపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రగతి పనులకు నిధులు విడుదల

- నియోజకవర్గంలో త్వరలోనే ప్రారంభిస్తాం : కలెక్టర్

కొడంగల్, జూన్ 25 : నియోజకవర్గానికి మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభిస్తామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణానికి విచ్చేసిన వారు స్థానిక కడా కార్యాలయంలోఅధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ. 5 వేల కోట్లు సెగ్మెంట్‌కు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో ప్రగతి పనులను చేపట్టేందుకు అసైమెంట్, అటవీ, అన్యాక్రాంతమై సాగులో లేని భూములను గుర్తించినట్లు తెలిపారు. రూ.124.50 కోట్లు మెడికల్ కళాశాల భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు రూ.27 కోట్లు, ఫిజియోథెరపీ కళాశాల నిర్మాణానికి రూ.27 కోట్లు, 220 బెడ్ల సామర్థ్యం కలిగి టీచింగ్ దవాఖానగా అప్‌గ్రేడ్‌కు రూ.27 కోట్లు, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు రూ.14.26 కోట్లు, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2945 కోట్లు, కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలగా మార్చేందుకు రూ.30 కోట్లు, కోస్గిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.11కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు నూతన భవనాల నిర్మాణానికి రూ.20 కోట్లు, ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి రూ.6 కోట్లు, మహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ. 30 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో కొడంగల్ రూపురేఖలు మారనున్నాయన్నారు.

## నేడు నూతన జడ్పీ భవనం ప్రారంభం

వికారాబాద్, జూన్ 25 : వికారాబాద్ జిల్లా పరిషత్ భవనం నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నది. రూ.5 కోట్లతో వికారాబాద్-పరిగి మార్గంలో నిర్మించిన జడ్పీ నూతన భవన ప్రారంభానికి రాష్ట్ర శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఆయనతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా లోని అధికారులు పాల్గొననున్నారు.

# బదిలీలు నిలిచిపోయినట్టేనా?

**బల్దియాలో జాబితా సిద్ధమైనా...**
**కమిషనర్ మార్పుతో మరింత ఆలస్యం**

**అవినీతి, ఆరోపణలు, తిష్టవేసిన అధికారులకు కలిసొచ్చిందని ఉద్యోగ వర్గాల్లో చర్చ**

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ ): జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీలకు బ్రేక్‌లు పడ్డాయా? జాబితా సిద్ధమైన ఇప్పట్లో ట్రాన్స్‌ఫర్స్ ఉండవా? కమిషనర్ మార్పుతో మరిన్ని నెలలు బదిలీల జోలికి వెళ్లరా? అంటే ఉద్యోగ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తున్నది. ఒకే చోట మూడేళ్లకు పైబడి జూనియర్ అసిస్టెంట్ మొదలు, అదనపు కమిషనర్ల వరకు అన్ని విభాగాలకు సంబంధించి పెద్ద ఎత్తున బదిలీలు జరిపేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న రొనాల్డ్‌రాస్ శాఖల వారీగా నివేదికలు తెప్పించుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2500 నుంచి 3వేల మంది ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించారు. కమిషనర్ రొనాల్డ్‌రాస్ సెలవు నుంచి రాగానే బదిలీల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ రొనాల్డ్‌రాస్ స్థానంలో ఆమ్రపాలి కాట్రను కమిషనర్‌గా నియమిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్ మార్పుతో ఒక్కసారిగా బదిలీల అంశం పక్కదారి పోయే అవకాశాలు కనబడుతున్నాయన్న చర్చ ఉద్యోగుల్లో మొదలైంది. అసలే వర్షాకాలం, నూతన కమిషనర్‌గా శాఖపై పూర్తి స్థాయి పట్టు వచ్చే వరకు బదిలీల అంశానికి వెళ్లేందుకు ఆసక్తి కనబర్చరన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తంగా జీహెచ్ఎంసీలో అవినీతి, ఆరోపణలు, సుదీర్ఘకాలం తిష్ట వేసిన ఉద్యోగులకు కమిషనర్ మార్పు కలిసొచ్చాయంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ సిబ్బంది మొత్తం కలిపి 26 నుంచి 28వేల మంది ఉంటారు. 18,500 శానిటేషన్ వర్కర్లు, 950 సూపర్ వైజర్లు, 500 నుంచి 800 మంది ఆపరేటర్లు, 500 మంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, 400 మంది సూపరింటెండెంట్లు , సుమారు 100 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 20 మంది జాయింట్ కమిషనర్లు, 20 మంది మెడికల్ ఆఫీసర్లు, 30 మంది డిప్యూటీ కమిషనర్లు ఉన్నారు. అయితే ఎక్కువగా బదిలీల్లో మూడేళ్లకు పైబడి ఒకే చోట కొనసాగుతుండటం, అవినీతి, ఆరోపణలు, వివాదాస్పద అధికారులకు స్థానచలనం ఉంటుందని భావించారు. ఇంజినీరింగ్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి ఇతర మున్సిపాలిటీలకు, అక్కడి నుంచి జీహెచ్ఎంసీకి మార్పులు, చేర్పులు జరుగుతాయని అధికారుల్లో చర్చ జరుగుతున్న తరుణంలో ఒక్కసారిగా వీటికి మరింత కాలం బ్రేక్ పడినట్లైంది.

# స్టాండింగ్ కమిటీ సమావేశమెప్పుడు?

**ఎన్నికల కోడ్ ముగిసినా**
**పత్తా లేని పాలకమండలి**

**మీటింగ్‌పై చొరవ తీసుకోని**

**మేయర్ విజయలక్ష్మి**




సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సమావేశాలకు మంగళం పాడారు. ప్రతి వారంలో బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులు, కమిషనర్, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఆయా శాఖల ముఖ్య అధికారులు కలిసి అభివృద్ధి, జంక్షన్లు, చెరువుల సుందరీకరణ, మురుగునీటి మళ్లింపు, పార్కులు, సెంట్రల్ మీడియంలను కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద అభివృద్ధి చేయడం లాంటి కీలక అంశాలపై పాలక మండలి సభ్యులు చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఇటీవల పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో వారంలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కోడ్ ముగిసి 20 రోజులు అవుతున్నా... ఇప్పటి వరకు ఈ సమావేశంపై ఉలుకు పలుకు లేదు. రొనాల్డ్‌రాస్ 15 రోజుల పాటు సెలవులో ఉన్నారన్న కారణంతో సమావేశాలను మేయర్ నిర్వహించలేదు. అయితే ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలను రెండు రోజుల క్రితం స్త్రప్రభుత్వం అప్పగించింది. ఎజెండాలను సిద్ధం చేసి ఈ వారంలో స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ కనీసం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆషాఢ బోనాల ఉత్సవాలు, కొత్త కమిషనర్ కావడం తదితర కారణాలతో మేయర్ సైతం స్టాండింగ్ కమిటీపై ఆసక్తి కనబర్చడం లేదు. ఈ క్రమంలో వచ్చే వారంలోనే స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉంటాయా? లేక వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. మొత్తంగా ప్రతి వారంలో రూ. రెండు కోట్ల నుంచి రూ. 3 కోట్ల మేర విలువైన పనులకు బ్రేక్ పడనుండటంతో సమస్యలు మరింత జటిలమవుతున్నాయి. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చేయడం పై ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బాలుడిని చితకబాదిన వారిని అరెస్టు చేయాలి

- దళిత, బీసీ కుల సంఘాల నాయకుల డిమాండ్
- ముంబాయి-బెంగుళూరు లింకు జాతీయ రహదారిపై గంటపాటు ధర్నా, రాస్తారోకో



షాబాద్ : ముంబాయి-బెంగళూరు లింకు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న కులసంఘాల నాయకులు

షాబాద్, జూన్ 25 : జామపండ్లు దొంగిలించాడని ఓ బాలుడిని తాళ్లతో కట్టేసి చితకబాదిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని దళిత, బీసీ కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం షాబాద్ చౌరస్తాలో ముంబాయి-బెంగుళూరు లింకు జాతీయ రహదారిపై వారు సుమారు గంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కేసారంలో మూడు రోజుల క్రితం బేగరి రాములు కుమారుడు బేగరి యాదగిరి స్నేహితులతో కలిసి ఆడుకుంటూ ఆ గ్రామానికే చెందిన మధుసూదన్‌రెడ్డి ఇంట్లో ఉన్న జామచెట్టు నుంచి పండ్లు తెంపు కొన్నందుకు ఆ చిన్నారిని విచక్షణారహితంగా కొట్టారు. విషయం తెలుసుకున్న రంగారెడ్డిజిల్లాలోని కుల, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు కేసారం గ్రామానికెళ్లి బాధితుడు కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆల్ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణాయాదవ్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు రాంచందర్ మాట్లాడుతూ...విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబీకులు దళిత బాలుడిని విచక్షణారహితంగా కొట్టడంపై మండిపడ్డారు. వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. కుల సంఘాల ధర్నా, రాస్తారోకోతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బందితో వచ్చి కులసంఘాల నాయకులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ధర్నాలో మాల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి విశ్వం మాదిగ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్, సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు దేవేందర్, సమత సైనిల్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశ్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర మీడియా కార్యదర్శి యాదగిరి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, కులసంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి శ్రీశైలం, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి చందు, యాదయ్య, ఎమ్మార్పీఎస్ ఆయా మండలాల అధ్యక్షులు మల్లికార్జున్, మహేందర్, కుల సంఘాల నాయకులు రాములు, యాదగిరి, నవీన్, నర్సింహులు, రాజు, బుక్క రవి, బాల్‌రాజ్, బందీశ్వర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల బాధ్యతగా మెలగాలి..

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
- కొడంగల్, పరిగి పోలీస్‌స్టేషన్ల సందర్శన

కొడంగల్ : సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి




కొడంగల్/పరిగి, జూన్ 25 : విధుల పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన కొడంగల్, పరిగి పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఠాణాల్లోని రికార్డులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎస్ఐలు భరత్‌రెడ్డి, సంతోష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### హెచ్ఎండీఏ భూములకు

# జీఐఎస్ మ్యాపింగ్

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): మియాపూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా ప్రయత్నాలతో హెచ్ఎండీఏ మేల్కొం ది. గ్రేటర్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో ఉన్న భూములను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుంది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ (జీఐఎస్) పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా హెచ్ఎండీఏకు చెందిన భూము ల సరిహద్దులను కో ఆర్డినేట్స్‌ను గూగుల్ మ్యాప్‌లో కచ్చితంగా గుర్తించేలా చర్యలు చేపట్టారు. మియాపూర్‌లో సర్వే నం.100, 101లో 445 ఎకరాలు ఉండగా, మిగతా ప్రాంతాల్లో సుమా రు 7500 ఎకరాల భూమి ఉంది. వీటికి గూగుల్ మ్యాప్‌లో వాటి సరిహద్దులను జియో మ్యాపింగ్ ద్వారా గుర్తించడంతో వాటి సరిహద్దులను చెరిపేసేందుకు వీలుండదని, కబ్జా చేయడానికి అవకాశం ఉండదని హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగం అధికారులు తెలిపారు. గూగుల్ మ్యాప్‌లో అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించమే కాకుండా భౌతికంగా భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగానే మియాపూర్‌లో క్షేత్ర స్థాయిలో ఫెన్సింగ్ పనులు మొదలు పెట్టారు. జియో ఫెన్సింగ్ బాధ్యతలను కన్సల్టెన్సీలకు అప్పగించామని తెలిపారు.

హెచ్ఎండీఏకు అప్పగించిన భూములకు జీఐఎస్ మ్యాపింగ్ చేసిన తర్వాత ఆ సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని అధికారులు తెలిపారు. దీనివల్ల హెచ్ఎండీఏ భూములు ఎక్కడెక్కడ ఎంత విస్తీర్ణంతో, సరిహద్దులతో ఉన్నాయో ఆన్‌లైన్‌లోనే గుర్తించే అవకాశం ఉంటుంది.



## అప్పాయిపల్లిలో భూ సర్వే..

మండలంలోని అప్పాయిపల్లి గ్రామ సర్వే నం.19 ప్రభుత్వ భూమిలో అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొడంగల్‌కు మెడికల్ కళాశాలను మంజూరు చేసిందని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ కళాశాల నిర్మా ణానికి కేటాయించబడ్డ భూమిలో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. సర్వే నం. 19లో రైతులు ఎంత మంది ఉన్నారు.. ఎంత భూమి ఉన్నది అనే దానిపై సర్వే చేసి నివేదికను తయారు చేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. -కొడంగల్, జూన్ 25

# కబ్జాదారులే కథానాయకులు

## మియాపూర్ భూముల ఆక్రమణ వెనక హస్తం వారిదే

మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను మే 30న కూల్చివేస్తున్న అధికారులు



సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ): మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల కబ్జా ప్రయత్నం సంచలనంగా మారింది. రెండు, మూడు రోజులపాటు పరిస్థితి అదుపులోకి రావడం లేదని భావించిన పోలీసులు మియాపూర్‌లో 144 సెక్షన్ విధించారు. ఈ కఠిన నిర్ణయానికి దారితీసిన మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూ ముల కబ్జా వెనుక పెద్ద కథే ఉంది. మియాపూర్ రెవె న్యూ సర్వేనం. 100,101 లో ఉన్న సుమారు 445 ఎకరాలను ఆనుకొని ఉన్న స్టాలిన్‌నగర్, ముజఫర్ అహ్మద్ నగర్, దీప్తిశ్రీనగర్, పీజేఆర్ కాలనీలున్నాయి. 2003లో ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన భూముల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ లేకపోవడంతో క్రమంగా స్థానికులు కబ్జా చేసి ఇళ్లను నిర్మించారు. కబ్జా చేస్తున్నది ప్రభుత్వ భూమిఅని తెలిసినా, దానికి ఎలాంటి పత్రాలు లేకపోయినా గుడిసెలు కాకుండా ఏకంగా జీ ప్లస్ 1, 2 అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. ఇలా హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల చుట్టూ అక్రమ కట్టడాలు ఉన్నట్లుగా ఆలస్యంగా గుర్తించిన అధికారులు గత నెల 30న కూల్చివేతలు మొదలెట్టారు. ప్రైవేట్ భూముల సర్వేనంబర్లతో ప్రభుత్వ భూములకు బై నంబర్లతో డా క్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేసుకోవడమే కాకుం డా భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు సర్వే నం. 101లో వెలసిన 15 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

### మూకుమ్మడి కబ్జాకు యత్నం

హెచ్ఎండీఏ అధికారులు ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టడంతో ఏమీ చేయలేని కొందరు కబ్జా దారులు తాము కబ్జా చేసిన స్థలాన్నే కాకుండా అక్కడ ఖాళీగా ఉన్న స్థలాన్ని కబ్జా చేసి గుడిసెలు వేయాలన్న ప్రణాళికను రచించారు. అందులో భాగంగానే ఆ చుట్టు పక్కల ఉన్న వారితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని వర్గాల వారికి మియాపూర్ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోవచ్చని ప్రచారం చేశారు. మే 30న కూల్చివేతలు చేపట్టిన తర్వాత నుంచి ఇదే పనిలో అక్కడి కబ్జారాయుళ్లు పకడ్బందీ పథకాన్ని రచించి ఒకేసారి వేలాది మంది ప్రజలు మియాపూర్ భూముల్లోకి చొచ్చుకువచ్చేలా చేశారు. మూడు రోజుల పాటు వేలాది మంది పేద ప్రజలు మియాపూర్ హెచ్ఎండీఏ భూముల్లో గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకునేందుకు వస్తే వారి పైనే రాళ్ల దాడికి దిగారు.

### కట్టేప్పుడు కండ్లు మూసుకున్నారు..

మియాపూర్‌లో తాజా పరిస్థితులు ఇలా ఉంటే... కబ్జాల పర్వం ఎప్పుడో మొదలైంది. హెచ్ఎండీఏ భూములను కాపాడాల్సిన ఎస్టేట్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దాని ఫలితంగానే కబ్జా చేసిన భూముల్లో తాత్కాలిక నిర్మాణాలైన గుడిసెలు, రేకుల షెడ్లు కాకుండా పక్కా భవనాలు వెలిశాయి. అయినా హెచ్ఎండీఏ అధికారులు మాత్రం అక్రమ కట్టడాలను అడ్డుకోలేదు. వేల కోట్లు విలువ చేసే భూముల్లో నిర్మాణాలు చేస్తుంటే.. అడ్డుకోకుండా వారి నుంచి అంతస్తుకు కొంత మొత్తం చొప్పున వసూళ్లు చేసుకొని మిన్నకుండిపోయారన్న ఆరోపణలున్నాయి. హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగంతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని పోలీసు అధికారులు సైతం కబ్జాదారులకు సహకరించడంతోనే 2, 3 అంతస్తుల పక్కా భవనాలు మియాపూర్ భూముల్లో వెలిశాయని తాజా కూల్చివేతలతో వెల్లడైంది. దీనికి తోడు చుట్టూ ఉన్న కాల నీ, బస్తీవాసులు సైతం ఈ భూముల్లో పాగా వేయాలన్న పథకంతో వేలాది మందిని అక్కడికి వచ్చేలా చేసి కబ్జాకు ప్రయత్నించారు. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ తీవ్రంగా పరిగణించి మియాపూర్‌లో 144 సెక్షన్‌ను విధించాల్సి వచ్చింది.

## భూములు ఆక్రమిస్తే చర్యలు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక**

మియాపూర్ : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి కలెక్టర్ శశాంక హెచ్చరించారు. శేరిలింగంపల్లి మండలం మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని సర్వే నం.100, 101లో ఇటీవల పెద్ద ఎత్తున ఆక్రమణలకు ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో, మంగళవారం సదరు భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇండ్ల స్థలాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునే విధా నం ఉంటుందని, దానిపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. అందుకు భిన్నంగా తమకు తామే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు యత్నించటం సరికాదన్నారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ఎండీఏ స్థలం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే కంచె ఏర్పాటు పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ వెంకారెడ్డి, అధికారులు ఉన్నారు.